
సాక్షి
జనగామ
సోమవారం | 9 | అక్టోబర్ | 2023



నోవర్క్..నోపేనేనా?

- 8లో▸

కేయూ కాంట్రాక్ట్ లెక్చరర్లకు గత నెల వేతనాలు చెల్లించలేదు. నోవర్క్..నోపే అనే ఆర్డర్ తెస్తారా అనే చర్చ జరుగుతోంది..



భవన నిర్మాణ కార్మికులను..

భవన నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$33.3^0/24.0^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉండి సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

చిన్నారులకు స్వర్ణప్రాశం పంపిణీ



జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని వేద ఆయుర్వేదిక్ పంచ కర్మ, వెల్‌నెస్ సెంటర్‌లో ఆదివారం చిన్న పిల్లలకు స్వర్ణ ప్రాశాన్ని ఉచితంగా వేశారు. ఆస్పత్రి డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో 125 మంది పిల్లలకు స్వర్ణ ప్రాశం వేసిన తర్వాత మాట్లాడారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. పిల్లల్లో కండరాల పటిష్టత, మేధోశక్తి, జీర్ణశక్తి, చర్మకాంతి, తదితర ఆరోగ్య పరంగా ఉపయోపడుతుంద న్నారు. కాగా పట్టణానికి చెందిన మిషిక అనే చిన్నారి గత రెండు నెలలుగా స్వర్ణప్రాశం తీసుకోవడంతో జలుబు, హెపటైటీస్ సమస్య తగ్గి, యాక్టివ్‌గా ఉంటుందని తల్లిదండ్రులు మధుసాయి, సింధూజ తెలిపారు.

శ్రీవిజయ దుర్గామాత ఆలయ కమిటీ ఎన్నిక



జనగామ: జనగామ పట్టణంలో దుర్గామాత పండుగ నిర్వాహణ నేపథ్యంలో బతుకమ్మకుంట శ్రీ విజయ దుర్గామాత ఆలయ ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో అన్ని కులసంఘాలు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే, ఆర్టీసీ సంస్థ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, చాంబర్ గౌరవ అధ్యక్షుడు పజ్జూరి గోపయ్య, మాజీ కౌన్సిలర్ గజ్జెల నర్సిరెడ్డి, అధ్యక్షుడు కర్రె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఉడుగులు కిష్టయ్య, మచంచ బాల్‌నర్సయ్య, బుస్సా సిద్దేశ్వర్, ఆలేటి నరేందర్, పాముకుంట్ల మధుగౌడ్, కూకట్ల కాశీ, ఆజ్మీరా స్వామి నాయక్, ప్రధాన కార్యదర్శి నీల యాదగిరి, కార్యదర్శి బాల్దె మల్లేశం, నిడిగొండ రాములు, మోర్తాల ప్రభాకర్, సహాయ కార్యదర్శి అరుకల ప్రభాకర్, కోశాధికారి ముప్పడి మల్లేశం, ప్రచార కార్యదర్శి నారోజు రామేశ్వరాచారి, మడికొండ నర్సింహులు, మోటె జనార్దన్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

24న విజయదశమి జరుపుకోవాలి



జనగామ: జిల్లాలో ఈ నెల 24న (మంగళవారం) విజయదశమి పండుగ జరుపుకోవాలని వేదపండితులు కృష్ణమాచార్య సిద్ధాంతి, మేళ్ల చెర్వు అప్పయ్య శాస్త్రీ, పట్టణ బ్రాహ్మణ సంఘం ప్రకటించింది. జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఆదివారం వేద పండితులు, ఆలయాల అర్చకులు, పుర ప్రముఖుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పండుగ నిర్వహణ నేపథ్యంలో శాస్త్ర ప్రమాణాలను లెక్కించి విజయదశమి పండుగ జరుపుకునే తేదీని ప్రకటించారు. 23న సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నవమి ఉండటంతో ఆ రోజు విజయదశమి జరుపుకోవడం సరైంది కాదని, 24న పండుగ జరుపుకోవాలని సూచించారు.

వనిత క్లబ్ గ్రేటర్ జనగామకు అవార్డులు



జనగామ:వరంగల్ గోల్డెన్ గార్డెన్‌లో గార్లపాటి రికన్ వెంకటేశ్వర సేవా పురస్కారాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరిగిన వేడుకల్లో ఉత్తమ సేవలు అందించిన వనిత క్లబ్ గ్రేటర్ జనగామకు అవార్డుల పంట పండింది. గడచిన ఐదు నెలల కాలంలో రూ.4లక్షల విలువ చేసే సేవా కార్యక్రమాలు చేపట్టి తమలోని మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా 11 అవార్డులు రాగా అతిథుల చేతుల మీదుగా క్లబ్ ప్రతినిధులు అందుకున్నారు. వనిత క్లబ్ అధ్యక్షురాలు మదంశెట్టి వరూధిని మాట్లాడుతూ అవార్డుల రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గంగిశెట్టి అనూజ, కోశాధికారి పులిగిల్ల నాగమణి, విస్తరణ అధికారి గంగి శెట్టి ప్రమోద్ కుమార్, గట్టు వెంకటేశ్వర్లు, పడకంటి రవీందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేటర్లను ఆదుకోరూ..



- టెక్నికల్ వ్యవస్థలో వారిదే కీలకం
- పంచాయతీరాజ్ శాఖలో 13 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులు
- హక్కుల కోసం రోడ్డెక్కిన వైనం

జనగామ: పంచాయతీరాజ్ శాఖలో ఈ-పంచాయతీ ప్రాజెక్టు మేనేజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు హక్కుల కోసం రోడ్డెక్కారు. 13 ఏళ్ల పాటు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సేవలందిస్తూ.. విధి నిర్వహణలో భద్రత కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగం పర్మనెంట్ అవుతుందనే ఆశలో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు.. సర్కారు కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. సాంకేతిక రంగాల్లో గ్రామపంచాయతీలను శక్తివంతంగా తయారు చేసి, ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ-పంచాయతీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2014-15లో ఇంటర్నెట్ అనుసంధానంతో జీపీ ద్వారా అందిస్తున్న అనేక రకాల సేవలను కంప్యూటరీకరించారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రాజెక్టు మేనేజర్లు, క్లస్టర్ ఈ-పంచాయతీల్లో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. జిల్లా వ్యాప్తంగా 22 మంది పనిచేస్తున్నారు. మారుమూల గ్రామం నుంచి జిల్లా కేంద్రం వరకు సర్కారుకు అవసరమైన సమాచారం అందిస్తూ, వారధిగా నిలుస్తున్నారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో క్వారీ సంస్థ ద్వారా ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల నియామకాలు జరిగాయి. కార్వీ సంస్థతో ఏడాది పాటు కుదుర్చుకున్న ఒప్పందం ముగియడంతో కంప్యూటర్ ఆపరేటర్ల సేవలు అవసరమని గుర్తించిన పంచాయతీ రాజ్ కమిషనర్ 2016లో వీరిని తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కంప్యూటర్ ఆపరేటర్లకు రూ. 8 వేలు వేతనాలు తగ్గకుండా అందించాలని అప్పట్లో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ-పంచాయతీ సేవలు బేషుగ్గా ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం 2018లో నూతన రిక్రూట్‌మెంట్ కూడా చేసింది. ఒక్కో ఆపరేటర్ క్లస్టర్ పరిధిలో 10 జీపీల వారీగా సేవలందిస్తున్నారు.



బతుకమ్మలతో నిరసన తెలుపుతున్న కంప్యూటర్ ఆపరేటర్లు (ఫైల్)

జీపీల్లో వీరే కీలకం

ప్రభుత్వానికి అవసరమైన నివేదికలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అందజేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు పల్లె ప్రగతి-1, 2, 3, 4 విడతలు, హరితహారం, జనన, మరణ ధ్రువీకరణ, భవన నిర్మాణం, ఆస్తి మార్పిడి, వ్యాపార లైసెన్సులు, నెలవారి ప్రోగ్రెస్, ఆసరా పెన్షన్ల నమోదు, మైనార్టీ కార్పొరేషన్లు, దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి, ఎన్నికల సమయంలో ఈ-పంచాయతీ కంప్యూటర్ల పాత్రనే కీలకం. కాగా ఈ -గ్రామ్ స్వరాజ్, ప్లాన్ ప్లస్, పీఎఫ్ఎంఎస్, ఆస్తుల జియో ట్యాగ్, లోకల్ గవర్నమెంట్ డైరెక్టరీ, జీపీ ఆదాయ, వ్యయాలను నిరంతరం కంప్యూటరీకరణ చేస్తూ... పంచాయతీరాజ్ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రానికి జాతీయ స్థాయిలో అవార్డులు రావడంలో ముఖ్యభూమిక పోషించారు. సమ్మె కారణంగా ఈ- పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మెకు దిగడంతో ఎక్కడికక్కడ పౌర సేవలు నిలిచిపోయాయి.

డిమాండ్లు ఇవి..

- జిల్లా స్థాయిలో పని చేస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు, ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి.
- మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి.
- బీమాతో ఆరోగ్య భద్రతను కల్పించాలి.
- మరణించిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా పోస్టింగ్ ఇచ్చి ఆదుకోవాలి.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా నియమ నిబంధనలను వర్తింప జేయాలి.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



ఎన్నో ఏళ్ల ప్రభుత్వానికి, పంచాయతీలకు వారధిగా ఉండి పని చేస్తున్న తమ శ్రమను ప్రభుత్వం గుర్తించాలి. సీఎం కేసీఆర్ తెలంగాణ స్వప్నం నిజం చేసేందుకు అభివృద్ధి, సంక్షేమం, కొత్త కొత్త పథకాలను అమలు చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పనిలో తమ భాగస్వామ్యం ఉంటుంది. తమ జీవితాలను ధారపోస్తూ, వెట్టిచాకిరీ చేస్తున్నాం. మా జీవితం ఇందులోనే గడచి పోతుంది. ఈ సమయంలో మరో ఉద్యోగం కొరకు వెళ్లే స్థితిలో లేము.

- మహేందర్, డీపీఎం

రెగ్యులరైజ్ చేయాలి..



పంచాయతీరాజ్ వ్యవస్థలో అధికారుల సూచనల మేరకు రాత్రి, పగలు అనే తేడా లేకుండా పని చేస్తున్నాం. చాలీచాలని వేతనాలతో శక్తికి మించి పని చేస్తున్నాం. ప్రభుత్వం తమపై కరుణ ఉంచి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి.

- మల్లేశం, ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్

కొడకండ్ల అద్భుతంగా మారింది



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

- 60 వేల మెజార్టీతో గెలుస్తా
- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల: కాంగ్రెస్ పాలనలో ఎడారిలా ఉన్న కొడకండ్లను అన్ని విధాల అభివృద్ధి చేసి అద్భుతంగా తీర్చిదిద్దడం జరిగిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాల్ నిర్వహించిన సోషల్‌మీడియా, యూత్ కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం జాలాలతో సాగునీటి పరవళ్లు, ఇంటింటికి నల్లా నీళ్లు, రోడ్ల అభివృద్ధి వంటి కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామాల్లో పనికిరాని విమర్శలు చేసే వాళ్లకు చర్చ ద్వారా అభివృద్ధిని వివరించి నోర్లు మూయించాలన్నారు. ఈసారి 60వేల పైబడి మెజార్టీతో గెలుస్తానని, కార్యకర్తలు నాయకులు కలిసికట్టుగా ముందుకు సాగాలని మంత్రి కోరారు. కాగా నేడు మంత్రి కేటీఆర్ మినీ టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన చేయనున్నారని, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జ్యోతి, మార్కెట్ చైర్మన్ రాము, మండల బీఆర్ఎస్, యూత్ అధ్యక్షుడు రామోజీ, సతీష్‌గౌడ్, సర్పంచ్, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

మండలకేంద్రంలో మినీటెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటునకు కేటాయించిన స్థలాన్ని ఆదివారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించారు. కేటీఆర్‌చే పార్క్‌కు శంకుస్థాపన నిర్వహిస్తున్నందున కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో పాటు అధికారులతో మంత్రి సమీక్షించి ఏర్పాట్లను పరిశీలించారు.

ఎల్లరాయని తొర్రూరులో..

పాలకుర్తి: మండలంలోని ఎల్లరాయని తొర్రూరు గ్రామంలో ప్రజలు కోరుకున్న పనులన్నీ పూర్తి చేయడం జరిగందని మంత్రి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం గ్రామంలో 33/11 కేవి సబ్‌స్టేషన్‌ను మంత్రి దయాకర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, సర్పంచ్ మల్లారెడ్డి, తహసీల్దార్ వెంకటేశం పాల్గొన్నారు.

గిరిజనులకు స్వపరిపాలన

దేవరుప్పుల: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే గిరిజన తండాలకు స్వపరిపాలన సాధ్యమైందని మంత్రి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం పాలకుర్తిలో మంత్రి ఎర్రబెల్లి క్యాంపు కార్యాలయంలో మండలంలోని పెద్దతండాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చంద్రబాను ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో గుగులోత్ బిచ్చు, పాండు, వీరన్న, బిక్కు, నరసింహ, శర్ల, వెంకన్న, దిలీప్, యాదగిరి, అమర్ సింగ్ ఉన్నారు.

కళలకు ప్రసిద్ధి వరంగల్..

- సినీ నటుడు నందమూరి బాలకృష్ణ
- 'భగవంత్ కేసరి' సినిమా ట్రైలర్ విడుదల

8లో▸



పోరాటాల పురిటి గడ్డ వరంగల్.. సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ వంటి యోధులను కన్న ఈ నేల.. కళలకు ప్రసిద్ధి చెందింది. వేయి స్తంభాల దేవాలయం వంటి చారిత్రక, వారసత్వ కట్టడాలతో అద్భుతాలు సృష్టించారని సినీ నటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. 'భగవంత్ కేసరి' సినిమా ట్రైలర్ విడుదల సందర్భంగా ఆయన మాట్లాడారు. - హన్మకొండ

ప్రజా సమస్యలపై పోరాడాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి

నర్మెట: ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. పసుపుబోర్డు, గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటుకు ప్రకటన చేయడంతో పాటు కృష్ణా ట్రిబ్యునల్‌తో నీటి సమస్యకు పరిష్కారం చూపిన ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి మండల కేంద్రం చౌరస్తాలో పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం పాలాభిషేకం చేశారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేసి కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం, అభివృద్ధి పనుల్లో కేంద్రం వాటా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు, మహబూబ్‌నగర్ ఇన్‌చార్జ్, జిల్లా మాజీ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శివరాజ్ యాదవ్, చౌడ రమేష్, జిల్లా కార్యదర్శి సొక్కం అనిల్ కుమార్, నవీన్, రాంకోటి, కొన్నె రాజు, వినోద్, జహంగీర్, చెవుల రాజు, ప్రయాగ నాగభూషణ శర్మ, నాయకులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దశమంతరెడ్డి

క్రీడాకారులకు సౌకర్యాలు కల్పిస్తాం

- జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి

చిల్పూరు: గ్రామంలో క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిమనని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజవరం గ్రామంలో ఆదివారం బుల్స్ యూత్ ఆధ్వర్యంలో రాజవరం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) సీజన్ క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయగా జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ స్థాయి పోటీలతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. క్రీడల ముగింపు రోజు ద్వితీయ స్థానం పొందిన వారికి తన సొంత నిధుల నుంచి రూ. 15వేలతో సౌకర్యాలు కల్పిస్తానన్నారు. యూత్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీను, ఎడ్ల ప్రశాంత్, రాజేష్, రాకేష్, విష్ణు నాయకులు రంగు రవి, బత్తుల సూర్యనారాయణ, యాకూబ్, వేణుగోపాల్, మచ్చ రమేష్, మోటం రాజు, తీగల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్

రాష్ట్రాన్ని దొంగల ముఠా పాలిస్తున్నది

- దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తయినట్లు కడియం నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గుండె విజయరామారావు

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రాని దొంగలముఠా పాలిస్తున్నారని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి ఓట్లు కొనుక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కడియం శ్రీహరి తెలంగాణ ద్రోహి అని, ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపారని విమర్శించారు. ఇటీవల పలు సమావేశాల్లో బీజేపీపై ఆయన చేస్తున్న వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. విద్యా శాఖ మంత్రిగా పనిచేసి కనీసం ఘన్‌పూర్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తీసుకురాలేదని విమర్శించారు. గతంలో నీటి పారుదలశాఖ మంత్రిగా పనిచేసి దేవాదుల ప్రాజెక్టు తానే తెచ్చానని అంటున్న కడియం.. ఒక్కసారి గుండెపై చేయి వేసుకుని చెప్పాలన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో దేవాదుల మంజూరైందని, 15 ఏళ్ల పాటు వివిధ శాఖలకు మంత్రిగా పని చేసిన ఆయన.. కనీసం పిల్లకాల్వ తేలేదని ఎద్దేవా చేశారు. దేవాదుల పనులు మొత్తం పూర్తయినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి.. రానున్న ఎన్నికల్లో ఎక్కడా పోటీ చేయను.. నిరూపించని పక్షంలో కడియం ముక్కు నేలకు రాయాలని సవాల్ చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకటేష్, నాయకులు బొజ్జపల్లి సుభాష్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, చిలుక విజయరావు, పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గుండె విజయరామారావు

ఇంకెప్పుడు..!

- అభ్యర్థుల ప్రకటనపై కాంగ్రెస్, బీజేపీ నేతల అసహనం
- 12 స్థానాల్లో అభ్యర్థులు ఖరారు.. నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ జోరు
- స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ పదవులు
- గులాబీ పార్టీలో సద్దుమణిగిన అంతర్గత కుమ్ములాటలు
- టికెట్లు ప్రకటించక స్తబ్దుగా కాంగ్రెస్, బీజేపీ ఆశావహులు



సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణలో మూడు రోజులపాటు పర్యటించి వెళ్లిన కేంద్ర ఎన్నికల కమిషన్.. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనుందన్న ప్రచారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్‌లో 11 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్.. జనగామ వివాదానికి కార్పొరేషన్ పదవి కట్టబెట్టడం ద్వారా చెక్ పెట్టింది. కాగా, దరఖాస్తు చేసుకుని నెల రోజులు గడుస్తున్నా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితా ప్రకటించని పరిస్థితి. క్లియర్‌గా ఉన్న స్థానాలపైనా స్పందించడం లేదన్న చర్చ ఉంది. ఇంకోవైపు బీజేపీ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన ఆ పార్టీ అధిష్ఠానం సైతం అభ్యర్థులను ప్రకటించడంలో వెనుకబడింది. దీంతో గతంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు నిర్వహించిన ఆ రెండు పార్టీల నాయకులు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో స్తబ్దుగా ఉన్నారు. టికెట్లు ప్రకటించిన తరువాతే రంగంలోకి దిగుదామనే ధోరణితో ఆ రెండు పార్టీల కేడర్‌లోనూ కొంత స్తబ్దత నెలకొంది.

ఖరారు కాని టికెట్లు.. ఆ రెండు పార్టీల కేడర్‌లో నిస్తేజం..

సెప్టెంబర్ 25 నాటికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సైతం క్లియర్‌గా ఉన్న స్థానాలకు మొదటి విడత జాబితాగా అభ్యర్థులను ప్రకటించనున్నట్లు ఆ రెండు పార్టీల అధిష్ఠానాలు ప్రకటించాయి. తర్వాత స్క్రీనింగ్ కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 5వ తేదీ వరకైనా కొన్నింటికి పేర్లు ఖరారు చేయనున్నట్లు చెప్పారు. కానీ, ఇప్పటికీ స్పష్టత రాకపోవడంతో ఆ రెండు పార్టీల కేడర్‌లో 'ఎప్పుడు ఇంతే..'నన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పరంగా చూస్తే ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు, ముగ్గురు నేతలు టికెట్ కోసం గట్టిగా పోటీ పడుతున్నారు. ఇప్పటి వరకు ములుగు, భూపాలపల్లి, పాలకుర్తి, నర్సంపేట, వరంగల్ తూర్పుల విషయంలో ధనసరి సీతక్క, గండ్ర సత్యనారాయణ, అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, దొంతి మాధవరెడ్డి, కొండా సురేఖల పేర్లపై స్పష్టత వచ్చినట్లు చెబుతున్నా.. అధికారిక ప్రకటన లేదు. వరంగల్ పశ్చిమ నుంచి నాయిని రాజేందర్‌రెడ్డి, జంగా రాఘవరెడ్డి, జనగామలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి, పరకాలకు కొండా మురళీధర్‌రావు, ఇనుగాల వెంకట్రాం రెడ్డి, డోర్నకల్ నుంచి రాంచంద్రునాయక్, నెహ్రూనాయక్‌లు, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, భూక్యా మురళీనాయక్, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి శనిగరం ఇందిర, దొమ్మాటి సాంబయ్యలు టికెట్ల కోసం పోటీపడుతున్నారు. బీజేపీలోనూ టికెట్ల పోరు రోజురోజుకూ పెరుగుతోంది. వరంగల్ పశ్చిమ నుంచి రావు పద్మ, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావులు, తూర్పు నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంట రవికుమార్, కుసుమ సతీశ్, నర్సంపేట నుంచి మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎర్రబెల్లి మదన్‌మోహన్‌రావులు టికెట్ రేసులో ఉన్నారు. భూపాలపల్లి నుంచి చందుపట్ల కీర్తిరెడ్డి, కటంగూరి రాంనర్సింహారెడ్డి, వర్ధన్నపేట నుంచి కొండేటి శ్రీధర్, జన్ను మధు, జనగామ నుంచి ఆరుట్ల దశమంతరెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డిల పేర్లు ఫైనల్‌లో ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. మహబూబాబాద్ నుంచి జాటోతు హుస్సేన్ నాయక్ పేరు ఫైనల్‌కు చేరగా, డోర్నకల్ నుంచి లక్ష్మణ్‌నాయక్, నర్సింహులపేట జెడ్పీటీసీ సభ్యురాలు సంగీత, పరకాల నుంచి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, డాక్టర్ కాళీ ప్రసాదరావు, పాలకుర్తి నుంచి లేగ రామ్మోహన్‌రెడ్డి, కర్ర శ్రీనివాస రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు, బొజ్జపల్లి సుభాష్, ములుగు నుంచి ఇటీవలే పార్టీలో చేరిన మాజీమంత్రి చందూలాల్ కుమారుడు అజ్మీర ప్రహ్లాద్, కృష్ణవేణి నాయక్‌ల పేర్లపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. రోజు రోజుకూ జరుగుతున్న జాప్యంతో ఎప్పటికీ అభ్యర్థుల జాబితా వెలువడుతుందన్న అసహనం ఆశావహులు, కేడర్‌లో కనిపిస్తోంది.

దూకుడు పెంచిన బీఆర్ఎస్ అభ్యర్థులు..

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయన్న సమాచారం మేరకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, అభ్యర్థులు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎన్నికల కోడ్ వస్తే.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడం కుదరదు గనక ఆ పార్టీ నేతలు పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నారు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లతో కార్యక్రమాలు, సభలు నిర్వహిస్తున్నారు. పథకాల పేరుతో ఓటర్లను కలుస్తున్నారు. నెల కిందటే బీఆర్ఎస్ అభ్యర్థులను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్‌లో 12 నియోజకవర్గాలుంటే అందులో జనగామకు అభ్యర్థిని ప్రకటించకపోగా, ప్రకటించిన స్టేషన్‌ఘన్‌పూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే డా.టి.రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిల మధ్య కుదరని సయోధ్య అధిష్టానానికి కొంత తలనొప్పిని కలిగించింది.రెండు రోజుల కిందట యాదగిరి రెడ్డికి ఆర్టీసీ చైర్మన్, రాజయ్యకు రైతుబంధు సమితి చైర్మన్ పదవులను కట్టబెట్టి సమస్యకు చెక్‌పెట్టింది. నేడే, రేపో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని జనగామ అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించనుండగా, ఉమ్మడి వరంగల్‌లో అన్ని స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారు చేసినట్లు అవుతుంది. ఇప్పటికే సభలు, సమావేశాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, అభ్యర్థులు షెడ్యూల్ తర్వాత మరింత దూకుడు పెంచేందుకు అన్నీ సిద్ధం చేసుకుంటున్నారు.

వాస్విక్ ఫౌండేషన్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు

- చైర్మన్ నరేష్‌కుమార్, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బచ్చన్నపేట: ప్రపంచ దేశాలను అతలాకుతలం చేసిన కరోనా సమయంలో ధైసాహసాలతో పలువురికి సేవలు అందించిన వాస్విక్ ఫౌండేషన్ సేవా సంస్థకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించిందని ఆ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ వారిచే సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డ్, సర్టిఫికెట్‌ను యూకే పార్లమెంటు అధికారుల చేతుల భారత రాజధాని ఢిల్లీలో అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ఫోన్‌లో మాట్లాడుతూ.. నాలుగేళ్ల నుంచి నిర్విరామంగా సేవలందిస్తున్నామని, పలు గ్రామాలలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలతో పాటు క్రీడా ప్రాంగణాల్లో పిల్లల ఆట వస్తువులు సమకూర్చి క్రీడా పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. గూడు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ఆర్థిక తోడ్పాటు, నిరుపేదలకు పెద్ద జబ్బులు వస్తే ఆస్పత్రి ఖర్చులు ఇచ్చామన్నారు. కరోనా సమయంలో శానిటైజర్లు, మాస్కులు అందజేశామని తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి సైతం సంస్థ తరఫున ఆర్థిక తోడ్పాటును అందించినట్లు వివరించారు.



పురస్కారం అందుకుంటున్న ఫౌండేషన్ చైర్మన్

క్లుప్తంగా

కోతి దాడిలో వృద్ధుడికి తీవ్రగాయాలు

కేసముద్రం: కోతి దాడిలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామంలో జరిగింది. దయ్యాల సాయిలు తన ఇంటి ఆవరణలో ఉండగా, అటుగా వచ్చిన కోతి అతడిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో క్షతగ్రాతుడిని వెంటనే మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఇటీవల ఇదే గ్రామంలో ఉప్పలయ్య అనే వృద్ధుడిపై కోతి దాడి చేసిన విషయం తెలిసిందే.

గ్యాస్ వాహనం ఢీ.. మహిళకు తీవ్ర గాయాలు

కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గ పోచమ్మ గుడి చింత హరిజన వాడలో గ్యాస్ వాహనం ఢీకొని మహమ్మద్ నసీమాకు తీవ్ర గాయాలయ్యాయి. నసీమా నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఎల్‌బీనగర్ ప్రీతి భారత్ గ్యాస్ ఏజెన్సీకి చెందిన టాటా ఏస్ వాహనం ఢీకొంది. దీంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, కుటుంబీకులు వెంటనే క్షతగాత్రురాలిని 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తుండగా.. క్లీనర్ (హెల్పర్) వాహనం నడపడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు.

అంతరిక్ష పరిశోధనకు పాలకుర్తి వాసి


మహేందర్

పాలకుర్తి టౌన్: సార భౌతిక శాస్త్రంలో పరిశోధన చేపట్టడానికి ఇటలీకి వెళ్లే అవకాశం జనగామ జిల్లా పాలకుర్తి మండలం విసునూరు వాసి డాక్టర్ అరూరి మహేందర్‌కు దక్కింది. ఉస్మానియా యూనివర్సిటీ అస్ట్రానమీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ మహేందర్.. స్పేస్ ఫిజిక్స్‌లో పలు సంస్థలకు అనేక పరిశోధన పత్రాలు సమర్పించారు. తాజాగా కోస్పార్ కెపాసిటీ బిల్డింగ్ ఫెలోషిప్ ప్రొగ్రాంకు ఎంపికయ్యారు. ఇటలీ రాజధాని రోమ్‌లోని ఇనిస్టిట్యూట్ కోస్పార్ చైర్ ప్రొఫెసర్ మరియానో మెండెజ్ పర్యవేక్షణలో పరిశోధన చేపట్టనున్నారు. ఈ మేరకు ఆరు వారాల పాటు ఇటలీలో ఉండనున్నారు. రీసెర్చ్ కోసం అక్కడి ప్రభుత్వం మహేందర్‌కు 2,600 యూరోల ఉపకార వేతనం అందిచనుంది. ఇక ప్రయాణ ఖర్చులను ఇస్రో భరించనున్నట్లు తెలిపిన డాక్టర్ మహేందర్.. ఆదివారం ఇటలీకి బయలుదేరి వెళ్లారు. మారుమూల గ్రామంలో పుట్టిన తనకు ఇటలీలో పరిశోధన చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు.

నో వర్క్.. నో పేనేనా!

- విధులు బహిష్కరించిన కాంట్రాక్టు లెక్చరర్లకు వర్తింపు..
- ఇంకా విడుదల కాని సెప్టెంబర్ వేతనాలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కాంట్రాక్టు లెక్చరర్లకు గత నెలకు సంబంధించిన వేతనాలు ఇప్పటి వరకు చెల్లించలేదు. నోవర్క్.. నోపే అనే ఆర్డర్ తెస్తారా అనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని కొందరు కాంట్రాక్టు లెక్చరర్లు కొంత కాలంగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటీవల తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోధ్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలు, పలు విభాగాలకు చెందిన కొందరు కాంట్రాక్టు లెక్చరర్లు కొన్నిరోజుల పాటు రిలే నిరాహారదీక్షలు చేశారు. మరికొందరు సంఘీభావం తెలిపారు. ఇటీవల కొందరు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయితే కొందరు అటెండెన్స్ రిజిస్టర్లలో సంతకాలు చేయకుండా కూడా విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. విధులు నిర్వర్తించకుండా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్న, దీక్షల్లో కూర్చున్న వారు పనిచేసిన రోజులకు మాత్రమే వేతనాలు చెల్లించాలని యూనివర్సిటీ యూనివర్సిటీ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. అందుకే వివిధ కళాశాలల, విభాగాల నుంచి వచ్చిన కాంట్రాక్టు లెక్చరర్ల వేతన బిల్లులు పరిపాలనా భవనంలోని ఆడిట్ విభాగానికి వచ్చినప్పటికీ ఈనెల 8 వరకు కూడా విడుదల చేయలేదని తెలుస్తోంది. నోవర్క్–నోపే ఆర్డర్ తేవాలని కూడా యూనివర్సిటీ అధికారులు చర్చించినట్లు తెలిసింది. ఈ విషయమై ఈనెల 9న స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.మల్లారెడ్డి మాత్రం.. విధులు బహిష్కరించిన కాంట్రాక్టు లెక్చరర్ల అటెండెన్స్ రిజిస్టర్లు పరిశీలించి ఆ మేరకు వేతనాల బిల్లులు చేసి అధికారులకు పంపినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

కేటీఆర్ సభకు భారీ జనసమీకరణ

- ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి
- మంత్రి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి: పాలకుర్తి, కొడకండ్ల మండలాల్లో ఈ నెల 9న (నేడు) నిర్వహించే రాష్ట్ర మంత్రి కేటీఆర్ సభకు భారీ జనసమీకరణ చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఆదివారం పాలకుర్తిలో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం చేయాలన్నారు. పాలకుర్తిలోని 30 పడకల ఆస్పత్రి 50 పడకలకు అప్ గ్రేడ్ అయిందని, దీని శంకుస్థాపనకు మంత్రి కేటీఆర్ హాజరవుతున్నారన్నారు. గత ప్రభుత్వాలు ప్రజా సమస్యలు గాలికొదిలేశాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు తాగునీరు, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మూడు విడతల్లో గృహ లక్ష్మి, దళితబంధు, ఉద్యోగాల కల్పన వంటి పథకాలను పూర్తి చేస్తామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం ద్వారా పాలకుర్తిలో అభివృద్ధి కనిపిస్తోందన్నారు. కరోనా సమయంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రజలను ఎన్నో విధాలా ఆదుకున్నామన్నారు. అలాగే, ట్రస్ట్ పేరుతో నిరుద్యోగులకు శిక్షణ, డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించామన్నారు. నియోజక వర్గంలో బమ్మెర, వల్మిడి, పాలకుర్తి వంటి ప్రదేశాల్లో సాంస్కృతిక అభివృద్ధి జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 9న జరిగే మంత్రి కేటీఆర్ సభకు భారీ సంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, బీపీఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎంపీపీ నాగిరెడ్డి, మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు, మాచర్ల ఎల్లయ్య, ఎండీ నజీర్, సుధాకర్, ఎర్రబెల్లి రాఘవరావు, వీరమనేని యాకాంతరావు, ఎండీ మదార్, మాచర్ల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ చాంపియన్ మంగపేట

- ద్వితీయ స్థానంలో కామారం
- ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు


ట్రోఫీని అందజేస్తున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నేతాజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన మిర్యాల్‌కార్ రవీందర్ స్మారక వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సీనియర్స్ పురుషుల విభాగంలో జరిగిన పోటీల్లో 16 జట్లు తలపడ్డాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో సాగిన పోటీల్లో ఫైనల్‌లో మంగపేట, కామారం జట్లు నువ్వా..? నేనా అన్నట్లు తలపడ్డాయి. బెస్ట్ ఆఫ్ త్రీలో రెండు మ్యాచ్‌లు గెలిచి కామారంపై మంగపేట జట్టు విజయం సాధించింది. కాగా, సెమీస్‌లో హనుమకొండ ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కాలేజీ, కొత్తగూడెం జట్లు తలపడగా మూడో స్థానంలో కేడీసీ, నాలుగో స్థానంలో కొత్తగూడెం జట్లు నిలిచాయి. ముగింపు వేడుకలకు చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీతో పాటు నగదు పురస్కారం అందజేశారు. అన్ని క్రీడా సంఘాలు, క్రీడాకారులకు సామగ్రి అందజేస్తున్నామని, రెండు రోజుల్లో నేతాజీ సంఘానికి కూడా క్రీడా కిట్లతో పాటు విద్యుత్ కనెక్షన్, విశ్రాంతి గది మంజూరు చేస్తానన్నారు. నేతాజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిండి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15వేలు, ద్వితీయ జట్టుకు రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5వేలు , నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 3వేల నగదు పురస్కారం, మెమొంటో అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, ఏసీపీ కందుకూరి నాగయ్య, మాజీ కార్పొరేటర్ మిర్యాల్‌కార్ దేవేందర్, నేతాజీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి ఇంద్రాసేనారెడ్డి, కార్యదర్శి బొబ్బిలి వెంకట్‌రెడ్డి, కోశాధికారి పాపిరెడ్డి, సభ్యులు మర్కాల యాదిరెడ్డి, గుండ్రాతి సుధాకర్, బొబ్బిలి లింగారెడ్డి, కటకం ఓంకార్, జ్యోతి, సారంగపాణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో పలువురిపై కేసు

వరంగల్ క్రైం: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం ఆవరణలో ఈనెల 6న ఎస్టీ బాయ్స్ కళాశాల హాస్టల్ విద్యార్థులపై అర్ధరాత్రి దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేసినట్లు సుబేదారి సీఐ షూకుర్ తెలిపారు. హాస్టల్ వార్డెన్ షేక్ అలీ మహ్మద్ ఫిర్యాదు మేరకు ప్రదీప్, సిద్దు, రజనీకాంత్, రమేష్, అభి, భాను, సాయి, తరుణ్, అశ్విన్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 6న సచిన్ తన క్లాస్‌మేట్ అమ్మాయికి మెసేజ్ పంపించడం కారణంగా గొడవ జరిగిందని తెలిపారు. ఈ ఘటనలో సుమతేజ్, రాజేందర్ అనే విద్యార్థులకు తీవ్ర గాయాలైనట్లు సీఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కళలకు ప్రసిద్ధి వరంగల్..


మాట్లాడుతున్న సినీ నటుడు బాలకృష్ణ

- చిత్ర పరిశ్రమను ప్రోత్సహించాలి
- సినీ నటుడు నందమూరి బాలకృష్ణ
- 'భగవంత్ కేసరి' సినిమా ట్రైలర్ విడుదల

హన్మకొండ: కళలకు ప్రసిద్ధి వరంగల్.. వేయి స్తంభాల దేవాలయం వంటి చారిత్రక, వారసత్వ కట్టడాలతో అద్భుతాలు సృష్టించారని సినీ నటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా చిత్రీకరించిన 'భగవంత్ కేసరి' సినిమా ట్రైలర్‌ను ఆదివారం రాత్రి హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా బాలకృష్ణ భగవంత్ కేసరి సినిమా గురించి మాట్లాడుతూ.. వీర సింహారెడ్డి చిత్రం మాదిరిగానే ఈ సినిమా.. మగాళ్లను సైతం కన్నీరు పెట్టిస్తుందన్నారు. ప్రభుత్వాలు చిత్ర పరిశ్రమను ప్రోత్సహించాలని, తద్వారా స్థానిక సంస్థలకు, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. భగవంత్ కేసరి సినిమా గురించి చెబుతూ.. ఇందులో ప్రతీ పాత్ర అద్భుతమని, తెలంగాణ మాండలికంలో ఉంటుందన్నారు. ఈనెల 19న విడుదలయ్యే ఈ చిత్రం దసరా డబుల్ ధమాక పండుగ అని పేర్కొన్నారు. వరంగల్ పోరాటాల పురిటి గడ్డ.. సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ వంటి యోధులను కన్న నేల.. ఇక్కడి నటులు, సాంకేతిక నిపుణులు, అందరి సమష్టి కృషితో ఈ చిత్రాన్ని తీశామన్నారు. తాను ప్రతి పుష్యమి నక్షత్రం రోజు దుర్గ మాతను పూజిస్తాను.. ఈ రోజు యాదృశ్చికంగా భద్రకాళి అమ్మవారి ఒడికి వచ్చాను.. ఇక్కడే సినిమా ట్రైలర్ విడుదల కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను వరంగల్‌కు చిన్న నాటి నుంచి వచ్చి వెళ్లేవాడినని, పెద్ద బావ దగ్గుబాటి వెంకటేశ్వర్‌రావు కేఎంసీలో వైద్య విద్య అభ్యసించారని చెప్పారు. మధ్య మధ్యలో డైలాగులు విసురుతూ బాలకృష్ణ ప్రసంగం సాగింది. 'నేను హీ రోగా రాబోతున్నాను.. అలాంటిది నువ్వు నా హీ రోయిన్ శ్రీలీలతో నువ్వు యాక్ట్ చేస్తావా' అంటూ తన కుమారుడు మోక్షజ్ఞ తిట్టాడంటూ బాలకృష్ణ చమత్కరించడంతో అభిమానులు కేరింతలు కొట్టారు. చిత్ర నిర్మాతలు సాహు, హరీష్ పెద్ది, కథానాయికలు కాజల్, శ్రీలీల, దర్శకుడు అనిల్ రావుపూడి, తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మలతో సినీతారలు

అధ్యాపకుల పెన్షన్ నిలిపివేత!

- ఫైనాన్స్ ఆఫీసర్‌తో పెన్షనర్ల వాగ్వాదం

కేయూ క్యాంపస్: తన పెన్షన్ ఎందుకు విడుదల చేయలేదని ఓ రిటైర్డ్ ప్రొఫెసర్ మూడురోజుల క్రితం కాకతీయ యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్యతో వాగ్వాదానికి దిగి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. మనస్తాపం చెందిన రాజయ్య వర్సిటీ పరిధి రిటైర్డ్ అధ్యాపకుల సర్వీస్ పెన్షన్ విడుదల చేయకుండా నిలిపివేసినట్లు తెలిసింది. ఈ విషయం యూనివర్సిటీ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. వర్సిటీ పరిధిలో 242 మంది రిటైర్డ్ అధ్యాపక సర్వీస్ పెన్షనర్లు ఉన్నారు. కేయూ పరిధి వివిధ వర్సిటీ కళాశాలలు, విభాగాల్లో పనిచేస్తున్న రెగ్యులర్ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇప్పటికే విడుదలయ్యాయి. అలాగే నాన్ టీచింగ్ పెన్షనర్లకు, టీచింగ్ ఫ్యామిలీ పెన్షనర్లకు కూడా పెన్షన్(డబ్బులు) విడుదల చేసిన రాజయ్య.. అధ్యాపక సర్వీస్ పెన్షనర్లకు ఇంకా విడుదల చేయలేదు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

జనగామ రూరల్: రెక్కాడితే గాని డొక్కాడని భవన నిర్మాణ రంగ కార్మికులకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జనగామ పట్టణంలో ప్రెస్టెన్ కళాశాల మైదానంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక గర్జన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చాడ వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తుంటే పాలకులు అణచాలని చూడడం సరికాదన్నారు. భవన నిర్మాణ, హమాలీ కార్మికుల కుటుంబాలకు కల్యాణ లక్ష్మి మాదిరి రూ. లక్ష అందించాలన్నారు. కార్మికులు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని, బీమా 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ వంద సంవత్సరాల నుంచి పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారబోయిన ప్రవీణ్‌కుమార్, బాల్నె మల్లేషం, తోట సునీల్, సుగుణమ్మ, రాములు, ఉపేందర్, యాకూబ్, మల్లయ్య, కనకయ్య, ఉప్పలయ్య, సుధాకర్, శ్రీశైలం, నగేష్, పోచయ్య, సదానందం, రాములు, విజయ, రజిత, సుశీల, నాగరాజు, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య కారణంతో మహిళ ఆత్మహత్య


సుధ

ఎల్కతుర్తి: అనారోగ్య సమస్యతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పాటి సుధ(45) కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురైంది. తరుచూ ఫిట్స్‌తో బాధపడుతుండేది. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చెకప్ చేయించగా జీవిత కాలం మందులు వాడాలని సలహా ఇచ్చారు. అప్పటి నుంచి మందులు వాడుతోంది. అయినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైన సుధ.. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన నారాయణగిరి వీరాచారి (57) ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వీరాచారి వెల్డింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆరేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఏ పని చేయలేక ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవల కుటుంబ కలహాలకు తోడు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అవమాన భారంతో వృద్ధుడు..

బయ్యారం: తనకు సంబంధం లేని విషయంలో అవమానించారని మనస్తాపంతో ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం సంతూలాల్‌పోడుతండాలో జరిగింది. మండలంలోని సంతూలాల్ పోడుతండాకు చెందిన గుగులోత్ కృష్ణ(65) నాటుకోళ్లు తన తోటలో పడ్డాయని అదే తండాకు గుగులోత్ రూప్‌చంద్ అతని భార్య జమున దూషించారు. తన కోళ్లు కాకున్నా తనను దూషించారని మనస్తాపంతో కృష్ణ గడ్డిమందును తాగాడు. కుటుంబీకులు గమనించి జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు బోజ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

రేపటి నుంచి ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ



కాజీపేట రూరల్ : ఈ నెల 10 నుంచి పలు ప్యాసింజర్ రైళ్లను యథావిధిగా పునరుద్ధరించి నడిపేందుకు నిర్ణయించినట్లు ఆదివారం రాత్రి దక్షిణ మధ్య రైల్వే అధికారులు రైల్వే అధికారులు తెలిపారు. రెండు నెలల నుంచి పలు రూట్లలో పలు ప్యాసింజర్ రైళ్లను మూడో రైల్వే మార్గం, ఇంజినీరింగ్ బ్లాక్ పనుల నేపథ్యంలో దక్షిణమధ్య రైల్వే అధికారులు రద్దు చేశారు. ఎట్టకేలకు దసరా పండగను పురస్కరించుకొని ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైళ్లను పునరుద్ధరించి నడిపించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

రైళ్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

కాజీపేట–సిర్‌పూర్‌టౌన్ (17003) ప్యాసింజర్, కరీంనగర్–సిర్‌పూర్‌టౌన్ (07765) మెమూ ప్యాసింజర్, సిర్‌పూర్‌టౌన్–కరీంనగర్ (07766) మెమూ ప్యాసింజర్, భద్రాచలంరోడ్–బల్లార్షా (17033) సింగరేణి ప్యాసింజర్, సిర్‌పూర్‌టౌన్–భద్రాచలంరోడ్ (17034) సింగరేణి ప్యాసింజర్ ఈ నెల 11 నుంచి బల్లార్షా–కాజీపేట (17004) రామగిరి ప్యాసింజర్ రైళ్లను నడిపించనున్నట్లు అధికారులు తెలిపారు.

పుష్‌పుల్ రైళ్లను కూడా పునరుద్ధరించాలి


కాజీపేట–విజయవాడ–కాజీపేట మధ్య నడిచే పుష్‌పుల్‌తో పాటు వరంగల్–హైదరాబాద్–వరంగల్ మధ్య నడిచే పుష్‌పుల్ రైళ్లను కూడా పునరుద్ధరించి నడిపిస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, మంత్రులు రైల్వే జీఎంతో మాట్లాడి పుష్‌పుల్ రైళ్లను కూడా నడిపించేలా చూడాలని కోరుతున్నారు. కాగా, పలు రూట్లలో ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణతో ఉదయం , సాయంత్రం అప్ అండ్ డౌన్ చేసే రైల్వే కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఎంప్లాయిస్, రైతులు, వ్యాపారులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


సింగరేణి రైలు పునఃప్రారంభం


- మణుగూరు ఎక్స్‌ప్రెస్‌కు డోర్నకల్‌లో హాల్టింగ్


డోర్నకల్: భద్రాచలం రోడ్–సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య నడిచే సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సోమవారం నుంచి పునఃప్రారంభం కానుంది. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి భద్రాచలం రోడ్ మధ్య నడిచే సింగరేణి (17034) ప్రారంభం కానుండగా మంగళవారం నుంచి భద్రాచలం రోడ్–బల్లార్షా (17033) రైలు ప్రారంభం కానుంది. సికింద్రాబాద్–మణుగూరు(12745), మణుగూరు–సికింద్రాబాద్(12746) మణుగూరు ఎక్స్‌ప్రెస్‌కు సోమవారం నుంచి డోర్నకల్ స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించనున్నారు.


వేర్వేరు ఘటనల్లో ఆరుగురి మృతి



మురళి(ఫైల్)


వెంకటరెడ్డి(ఫైల్)


బాలాజీ (ఫైల్)


లావణ్య (ఫైల్)


పవన్ (ఫైల్)


సతీష్ (ఫైల్)

కేసముద్రం: ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి ఓ తాపీమేస్త్రీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం గ్రామానికి చెందిన గడ్డం మురళి(38) ఇదే గ్రామశివారు చైతన్యనగర్‌కు చెందిన వేముల యాకయ్యతో కలిసి గ్రామంలో ఒకరి ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. స్లాబ్‌కు చుట్టూ కంటె గోడపై బెడ్‌పోసేందుకు సలాక్(ఇనుపచువ్వ)ను మలుస్తున్నారు. స్లాబ్‌కు దగ్గర నుంచే వెళ్లిన 11 కేవీ తీగలకు సలాక్ తాకడంతో వారు విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో మురళి అక్కడికక్కడే మృతి చెందగా, యాకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి భార్య అనిత, కుమార్తె గంగోత్రి, కుమారుడు ఈశ్వర్ ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కొమ్మలు కొడుతుండగా మరో వ్యక్తి..

కురవి : చెట్టు కొమ్మలు కొడుతుండగా గొడ్డలి విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతం సంభవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని అయ్యగారిపల్లిలో జరిగింది. ఎస్సై బి.గోపి కథనం ప్రకారం గ్రామానికి చెందిన కట్ల వెంకటరెడ్డి(52) గ్రామంలోని నర్సింగం కొమురెల్లి ఇంటి ఎదుట ఉన్న చెట్టు కొమ్మలు కొడుతున్నారు. ఈ క్రమంలో కొమ్మల పక్కన ఉన్న విద్యుత్ తీగలకు గొడ్డలి తగలడంతో విద్యుత్ షాక్ వచ్చింది. దీంతో వెంకటరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లక్ష్మీపురంలో మరొకరు..

గూడూరు: మండలంలోని లక్ష్మీపురంలో ఆదివారం వ్యవసాయ బావిలోని విద్యుత్ మోటార్ మరమ్మతు కోసం దిగిన అజ్మీరా బాలాజీ (40) విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు అజ్మీరా గణేష్, భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

డెంగీతో విద్యార్థిని..

చెన్నారావుపేట: డెంగీతో ఓ విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని అమృతండా(ఎర్రగడ్డతండా)లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం తండాకు చెందిన భూక్య హరి, సరోజ దంపతుల కుమార్తె లావణ్య పాపయ్యపేటలోని గుడ్‌షపర్డ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనమేరకు వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కాగా, లావణ్య మృతితో తండా, పాపాయ్యపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

చెన్నారావుపేట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పనికరలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బండారి పవన్ (30)కు నెల రోజుల క్రితం కుమారుడు జన్మినించాడు. అమీనాబాద్‌లో ఉంటున్న తన భార్య వద్దకు వెళ్లి కుమారుడిని చూశాడు. తిరిగి శనివారం రాత్రి ద్విచక్రవాహంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి రామన్నకుంట వద్ద చెట్టును ఢీకొంది. దీంతో పవన్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు.

గుండెపోటుతో రికార్డు అసిస్టెంట్..

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోమాకుల సతీష్(45) గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో తోటి ఉద్యోగులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. సతీష్ మృతి పట్ల సీపీ ఏవీ రంగనాథ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరిపాలన విభాగం అదనపు డీసీపీ రాగ్యానాయక్, ఉద్యోగులు, పోలీస్ అధికారులు, అధికారుల సంఘం సభ్యులు ఆదివారం హన్మకొండ గోకుల్‌నగర్‌లోని సతీష్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం సతీష్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.20 వేలు అందజేశారు. సతీష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.